గురుకులం ప్రారంభించేదెప్పుడో?

- గత విద్యా సంవత్సరం ఆదిలాబాద్‌లో తరగతులు ప్రారంభం
- బేలలో సిద్ధమవుతున్న నూతన భవనం
- పట్టించుకోని అధికారులు



బేలలో సిద్ధమవుతున్న నూతన భవనం

బేల: ఏళ్ల క్రితం అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో స్థలం కేటాయింపు చేయకపోవడంతో మండలానికి మోడల్ స్కూల్ మంజూరు కాలేదు. దీంతో మండలానికి ఇంగ్లీషు మీడియం స్కూల్ లేకుండా పోయింది. ఈక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటి దఫాలో మంజూరు చేసిన గురుకులాల్లోనూ మండలానికి అవకాశం దక్కలేదు. దీంతో మండలానికి చెందిన నిరుపేద విద్యార్థులు జైనథ్ మోడల్ స్కూల్‌లో అవకాశాలు లేకపోవడంతో, ఇంగ్లీషు మీడియం విద్యకు దూరమయ్యారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన మండల ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్, జెడ్పీటీసీ అక్షిత సతీష్ పవార్‌ల ప్రత్యేక చొరవతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో గత విద్యా సంవత్సరంలో ఎట్టకేలకు మండలానికి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులం(బాలురు) మంజూరైంది. కానీ మండల కేంద్రంలో ప్రైవేటు, ప్రభుత్వ భవన సముదాయాలు ఏమాత్రం అందుబాటులో లేకపోవడంతో జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఉన్న మావలలో ఓ ప్రైవేటు భవన సముదాయంలో గురుకుల పాఠశాల నిర్వహణను గత విద్యా సంవత్సరం అక్టోబర్‌లో ప్రారంభించారు. దీంతో ఆ వెంటనే అక్కడే 5, 6, 7 తరగతుల నిర్వహణను సైతం గురుకులం సొసైటీ వారు చేపట్టారు. ఈ క్రమంలోనే ఈవిద్యా సంవత్సరంలో మరో తరగతి అప్‌గ్రేడ్ అయి 8వ తరగతి వరకు సైతం నిర్వహణ చేపట్టారు. ఒక్కొక్క తరగతిలో 80 సీట్ల చొప్పున సీట్లు కేటాయించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, రాత పరీక్షల ద్వారా ఫలితాల ఆధారంగా మెరిట్ ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపడుతున్నారు.

చివరి దశకు పనులు..

మండల కేంద్రంలో గురుకులం నిర్వహణకు లీజ్‌కు తీసుకున్న రెండేకరాల ప్రైవేటు స్థలంలో, ప్రైవేటు యాజమాని పర్యవేక్షణలోనే గత 14 నెలల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తరగతి గదులు, నివాస గదులతో పాటు ఇతరత్రా అన్ని సౌకర్యాలు, హంగులతో భవన నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఆదిలాబాద్ నుంచి ఇక్కడికి గురుకులం నిర్వహణను గత డిసెంబర్‌లోనే తరలించేందుకు కసరత్తు చేశారు. కానీ సాధారణ ఎన్నికలతో జాప్యమైంది. ఈ విద్యా సంవత్సరంలో మరో రెండు నెలలు ఉండడంతో ఇక్కడ గురుకులం పాఠశాల తరగతుల ప్రారంభం ఎప్పుడు చేస్తారో తెలియని ప్రశ్నార్థక పరిస్థితి నెలకొంది. ఇకనైనా మండల ప్రజాప్రతినిధులు, సంబంధిత గురుకులం అధికారులు ఇక్కడ పాఠశాల నిర్వహణను ప్రారంభించడానికి సన్నాహక చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న జాదవ్ రాంకిషన్ నాయక్

నార్నూర్: కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జాదవ్ రాంకిషన్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోఖండే దేవ్‌రావ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధిష్ఠానం ఆదేశిస్తే ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. జిల్లాలో రిటైర్డ్ జనరల్ మేనేజర్‌గా సుదీర్ఘకాలంగా ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఏజెన్సీ మండలాలైన నార్నూర్, గాదిగూడలకు దాదాపు ఐదు సంవత్సరాలు ప్రత్యేకాధికారిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిందని ఆరోపించారు. ఎంపీగా అవకాశం ఇస్తే వంద శాతం గెలిచి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో నాయకులు జాదవ్ కైలాస్ నాయక్, మడవి లక్ష్మికాంత్, మాజీ సర్పంచ్ చౌహాన్ డిగాంబర్, రాథోడ్ దత్త రామ్, జాకిరుల్ల ఖాన్, షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యే కంటే ఎక్కువ నిధులు తెచ్చా’



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఆడె గజేందర్

బోథ్: నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే కంటే తానే ఎక్కువ నిధులు తెచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ బోథ్ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో 15వ బ్లాక్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి, మంత్రి సీతక్క.. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యేకు రూ.6 కోట్లు కేటాయిస్తే.. తనకు రూ.ఏడు కోట్లు కేటాయించారన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం గజేందర్‌ను కాలనీవాసులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రజియా బేగం, మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్‌రెడ్డి, జీకె గంగాధర్, షేక్ మహమ్మద్, ఇట్టెడి రాజు, బొడ్డు గంగారెడ్డి, వంశీరెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల క్రీడాకారులకు కొదువ లేదు

నేరడిగొండ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువ లేదని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని బొందిడి గ్రామంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌కు ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో వడూరు, బొందిడి గ్రామాలకు చెందిన జట్లు తలపడ్డాయి. ఈమ్యాచ్ వడూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ వనిత జనార్ధన్, నిర్వాహకులు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తిపై ఎదిగేలా అనేక పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. మహిళల ఇబ్బందులను దూరం చేయడానికి ఉజ్వల పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. అతివల స్వయం ఉపాధి కోసం రుణాలను అందజేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మహిళలకు కుట్టు మిషన్లు, కంప్యూటర్, చేతివృత్తులపై శిక్షణ ఇచ్చేందుకు మరిన్ని శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, న్యాక్ అధికారులు పాల్గొన్నారు.

కబ్జా చేస్తే కఠినంగా వ్యవహరిస్తాం

ఆదిలాబాద్: నిరుపేదల భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో 170 కాలనీవాసులు ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 170 కాలనీలో కొందరు నాయకులు తమ భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు లాల మున్న, ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్, తదితరులు ఉన్నారు.

ఐక్యంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: బీసీలంతా ఐక్యంగా ఉంటే వారిని ఏ శక్తి అడ్డుకోలేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని బీసీ సంఘ భవనంపై నిర్మించిన మొదటి అంతస్తు భవనాన్ని బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కొండూరు గంగాధర్, చిక్కాల దత్తు, కలాల్ శ్రీనివాస్, ఆశన్న, ఆకుల ప్రవీణ్, గంద్రత్ సుజాత పాల్గొన్నారు.

ముగిసిన జంగుబాయి దీక్షలు

బోథ్: గత నెల రోజులుగా కొనసాగుతున్న జంగుబాయి దీక్షలు ముగిశాయి. నెల రోజులుగా పరమ పవిత్రంగా దీక్షలను కొనసాగించిన పట్నాపూర్ గ్రామానికి చెందిన దీక్షాపరులు ఆదివారం దీక్షలను విరమించడానికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ 'సోయం'

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామంలో ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకంలో మంజూరైన రూ.14 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులకు ఆదివారం ఎంపీ సోయం బాపూరావు భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గోడం నాగోరావ్, గ్రామపటేల్ తొడసం ఇస్రు, రాథోడ్ వసంత్‌రావ్, తొడసం నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న దండ్ల అశోక్

ఎదులాపురం: వడ్డెరలను బీసీ నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా వైస్ చైర్మన్ దండ్ల అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వడ్డెరలను బీసీ నుంచి తొలగించి ఎస్టీలో చేర్చించేలా కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపాలని కోరారు. వడ్డెర విద్యార్థులకు గురుకుల పాఠశాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, వడ్డెర కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పనుల్లో 20 శాతం ఈఎండీ లేకుండా పనులు కేటాయించాలన్నారు. బండ క్వారీలపై వడ్డెర్లకు పూర్తి హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయిరాం, మంజుల, దండుగుల నవీన్, తిమ్మయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మండలంలోని తంతోలి గ్రామంలో జోగు ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసికోల్లాసం నెలకొంటుందన్నారు. జోగు ఫౌండేషన్ తరఫున గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా టోర్నమెంట్‌ల నిర్వహణతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్, జగదీష్, కుమ్ర రాజు, పరమేశ్వర్, రాము పాల్గొన్నారు.

ప్రశాతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గిరిజన గురుకులాల సమన్వయ కర్త గంగాధర్

ఇచ్చోడ: మండల కేంద్రంలో మూడు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గురుకులాల ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాతంగా జరిగింది. గిరిజన గురుకుల బాలికల, బాలుర, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల్లో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈకేంద్రాలో 816 విద్యార్థులలో 785 మంది విద్యార్థులు హాజరు కాగా 31 మంది విద్యార్థులకు పరీక్షలకు గైర్హాజరైనట్లు గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మూడు కేంద్రల్లో నిర్వహిస్తున్న పరీక్షలను ఉమ్మడి జిల్లా గిరిజన గురుకులాల సమన్వయ కర్త గంగాధర్ పరిశీలించారు.

పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి నిధులివ్వాలి



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆదివాసీ పర్ధాన్ కులస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జీసీసీ ఎదుట ఆదివాసీ పర్ధాన్ కుల గురువు హీరసుకా జెండా ఆవిష్కరించి తమ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26న ఇంద్రవెల్లిలో నిర్వహించే హీరసుకా జయంతి వేడుకలకు ఆదివాసీ పర్ధాన్ కులస్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు దుర్వ నగేశ్, అనుసూయ, కుర్సెంగే తానాజీ, సెడ్మకే సుభాష్, ఆనంద్‌రావు, సిడాం పురుషోత్తం, మెస్రం శంకర్, జనార్ధన్, ప్రకాశ్, యాదవ్‌రావు, శేషరావు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పిప్పల్‌కోటి త్రిశూలంతో ఊరేగింపు చేస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. గత రెండు రోజులుగా ఆలయ ప్రాంగణంలో హోమం, నవగ్రహ, విగ్రహాలకు పూజలు చేపట్టారు. ఆదివారం వేకువజామున గర్భగుడిలో శివలింగం, గంగమ్మతల్లి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠించి, ధ్వజస్తంభం, త్రిశూలం ఆలయం వెలుపల ప్రతిష్ఠించారు. డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, బోథ్ కాంగ్రెస్ ఇంచార్జి గజేందర్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ తరఫున అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంగయ్య, గణేష్, రాంరెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అంగన్‌వాడీలు



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు రాధ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేలా అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. అలాగే ఆరోగ్యలక్ష్మి పథకానికి సంబంధించిన ఆహార పదార్థాలు నాసిరకంగా ఉన్నాయని, కాంట్రాక్టర్లపై విచారణ జరిపించేలా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులు భర్తీ అయ్యేలా చూడాలన్నారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

అన్నదానం అభినందనీయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణానికి వచ్చే నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఈవారంతో అన్నదాన కార్యక్రమం 151 వారానికి చేరింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సినీ నటి జ్యోతిశ్వరి హాజరై పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, సభ్యులు సలీమ్, సుభాష్, అంబయ్య, దత్తు, రాకేశ్, శేఖర్, లకన్ పాల్గొన్నారు.

‘రైల్వేలైన్ సాధించే వరకూ పోరాటం’

ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ కాసవేణి నారాయణ యాదవ్ అన్నారు. రైల్వేలైన్ సాధన కోసం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద చేపడుతున్న రిలే దీక్షలు 27వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలకు ఆర్ఎంపీల సంఘం సంఘీభావం ప్రకటించింది.

ఆర్ఎంపీలకు సర్టిఫికెట్లు అందేలా చూడాలి

ఆదిలాబాద్‌టౌన్: కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణ పొందిన ఆర్ఎంపీ, పీఎంపీలకు సర్టిఫికెట్లు అందేలా చూడాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కోరారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు, నాయకులు ఉన్నారు.

క్రికెట్ విజేతగా కలీమ్ ఎలెవన్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కలీం ఎలెవన్ జైనూర్ జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో హోప్ క్రికెట్ క్లబ్, కలీం ఎలెవన్ జట్ల మధ్య జరిగిన హోరాహోరి పోరులో నిర్ణీత 20 ఓవర్లలో హోప్ క్రికెట్ క్లబ్ 123 పరుగులు చేసింది. కలీం ఎలెవన్ జట్టు 15.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించి ఏడు వికెట్లతో విజేతగా నిలిచింది. మోహిత్ రౌత్ 52 పరుగులతో అజేయంగా నిలిచాడు. పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ హాజరయ్యి బహుమతులను ప్రదానం చేశాడు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలన్నారు.

సాహిత్యంతో నవసమాజ నిర్మాణం

ఉట్నూర్‌రూరల్: సాహిత్యంతో నవ సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని ఉట్నూర్ సాహితీ వేదిక వక్తలు అన్నారు. ఆదివారం ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. 2021లో నవంబర్ 14న ఉట్నూర్ సాహితి వేదిక విద్యార్థులు రచించిన కవిత్వ పరిమళాలు అనే పుస్తకం చింతోజు బ్రహ్మయ్య మెమోరియల్ బాలమణి బాల ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. దీనిపై సాహితి వేదిక సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ పిల్లలను సత్కరించారు. ఈఈ భీంరావు, ఉట్నూర్ సాహితి వేదిక అధ్యక్షులు, సభ్యల యు.మెస్రం మనోహర్, కట్ట లక్ష్మణాచారి, బంకట్‌లాల్, జ్ఞానేశ్వర్, ఇందల్‌సింగ్, వినోద్‌కుమార్, మాధవ్‌రావు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం’



మాట్లాడుతున్న రేఖానాయక్

బేల: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధిష్ఠానం పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశం ఇస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఒకవేళ అధిష్ఠానం ఎంపీ టికెట్ ఇవ్వకపోయినా ఇచ్చే వారి కోసం కలిసికట్టుగా పనిచేద్దామని, గెలుపును సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గిమ్మ సంతోష్, వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, నగేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ కవర్లతో డ్రెస్ అదిరేట్టు



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులతో తయారుచేసిన డ్రెస్ చూపిస్తున్న కృతిక

తాంసి: మండలంలోని హస్నాపూర్‌కు చెందిన యువకుడు కర్నేవార్ స్వామి ప్లాస్టిక్ వస్తువులతో డ్రెస్ తయారు చేశాడు. జిల్లాకేంద్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలు, ప్రత్యామ్నాయంపై ఎన్‌జీసీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కార్యక్రమం నిర్వహించారు. తలమడుగు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కృతిక, గ్రామానికి చెందిన యువకుడు స్వామి సహకారంతో ప్లాస్టిక్ కవర్లతో తయారుచేసిన డ్రెస్‌తో ప్రదర్శన ఇచ్చింది. ఈ ప్రదర్శనకు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది.

నేడు గ్రామసభ

బోథ్: బోథ్ గ్రామపంచాయతీలో సోమవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి అంజయ్య తెలిపారు. సభకు గ్రామంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొనాలన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను చర్చిస్తామని పేర్కొన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు.

సీఐ, ఎంపీడీవోల బదిలీ

బోథ్: బోథ్ సీఐ భీమేష్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. బోథ్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న భీమేష్ ఇచ్చోడ సీఐగా బదిలీ కాగా.. మహబూబాబాద్ సీఐగా విధులు నిర్వహిస్తున్న బానోత్ రమేశ్ బోథ్ సీఐగా బదిలీ అయ్యారు. బోథ్ ఎంపీడీవో సుశీల్ రెడ్డి నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు.

భీంపూర్ ఎస్సైగా ప్రదీప్ కుమార్

తాంసి: భీంపూర్ ఎస్సైగా ప్రదీప్ కుమార్ బదిలీపై రానున్నారు. ఎస్సైల బదిలీలో భాగంగా భీంపూర్ ఎస్సైగా పనిచేస్తున్న లాల్‌సింగ్ నాయక్‌ను ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. టౌ టౌన్‌లో పనిచేస్తున్న ఎస్సైగా పనిచేస్తున్న ప్రదీప్ కుమార్‌ను భీంపూర్ ఎస్సైగా బదిలీ అయ్యారు.

గృహజ్యోతికి పత్రాలు సమర్పించండి

బోథ్: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుటకు కరెంటు బిల్లు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు, రేషన్‌కార్డు, ఫోన్ నంబరును బోథ్ సబ్‌స్టేషన్‌లో అందజేయాలని విద్యుత్ శాఖ ఏఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మండలంలోని పిప్పల్‌దరి గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం తొలిసారి గ్రామానికి వచ్చిన ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడుసార్లు ఓడిపోయిన తాను ప్రజలందరి సహకారంతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని గుర్తు చేశారు. గ్రామస్తుల సహకారం ఎప్పటికీ మరిచిపోలేనని, అందుబాటులో ఉండి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి



పూజలు చేస్తున్న దౌలత్‌రావ్ మోకాశి

గుడిహత్నూర్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావ్ మోకాశి అన్నారు. మండలంలోని మారుమూల ఆదివాసీ పుణ్యక్షేత్రమైన పులికప్పారను సందర్శించి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నేటి తరం ఆదివాసీలందరూ సంప్రదాయలు పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. దేవస్థానం కమిటీ చైర్మన్ కుమ్ర దస్రు, కోరెంగ యశ్వంత్ మహరాజ్, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగుపటేల్, భూమా పటేల్, తదితరులు పాల్గొన్నారు.